క్లుప్తంగా

రేపటి నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లిలో విక్టరీ బాయ్స్ ఆధ్వర్యంలో గురువారం (జూన్ 1) నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఎన్.సూరి, ఎస్.ప్రతాప్, పి.వెంకన్న మంగళవారం తెలిపారు. ప్రథమ బహుమతి దాత సర్పంచ్ సుందరి నాగేశ్వర్‌రావు రూ.20016, ద్వితీయ బహుమతి మాజీ సర్పంచ్ మాశెట్టి నాగలక్ష్మీ శ్రీహరి రూ.15016, తృతీయ బహుమతి కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు నారాయణ రూ.10,116, ఎంపీటీసీ మేకల శోభన్‌బాబు రూ. 5016, నాగ ఫిల్లింగ్ స్టేషన్ రూ. 5016, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌కు దాత కంపసాటి లింగయ్య 1110, బెస్ట్ బౌలర్‌కు ఉత్తపల్లి గోవిందు జ్ఞాపకార్థం రూ. 1110 ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి సమాచారం కోసం సెల్ నంబర్ 9515721717, 6301971566ను సంప్రదించవచ్చన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

మేళ్లచెరువు : సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి పెద్ది శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 50 కేజీల జీలుగ విత్తనాలకు సబ్సిడీ పోను రైతులు రూ. 842 చెల్లించి తీసుకోవచ్చన్నారు. విత్తనాలు కావల్సిన రైతులు పట్టాదారు పాసుబుక్, ఆధార్ కార్డు జీరాక్స్‌లను దరఖాస్తుతో పొందుపరిచి స్థానిక పీఏసీఎస్‌లో విత్తనాలు పొందవచ్చని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గ్రామ స్థాయి ప్రత్యేక అధికారుల నియామకం

నడిగూడెం : మండలంలో జూన్ రెండో 2 నుంచి 22 వరకు నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గ్రామ స్థాయి ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఎంపీడీఓ యం.యర్రయ్య బుధవారం విలేకరులకు తెలిపారు. బృందావనపురం గ్రామానికి బి.రామలక్ష్మి, చాకిరాలకు నర్సింహారావు, ఎకలాస్ ఖాన్‌పేటకు రామారావు, కాగితరామచంద్రాపురంనకు నగేష్, కరివిరాలకు రేష్మా, కేశ్వాపురంనకు సురేష్, నడిగూడెంకు ఇమామ్ హుస్సేన్, నారాయణపురంనకు గోవర్దన్, రామాపురానికి సతీష్, రత్నవరానికి గురుస్వామి, సిరిపురానికి రవికుమార్, తెల్లబెల్లికి రజిని, వల్లాపురానికి వినోద్, వేణుగోపాలపురంనకు రాజశేఖర్‌రావులను నియమించినట్లు ఆయన తెలిపారు.

కొనసాగుతున్న విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు



వేడుకల్లో పాల్గొన్న సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామస్తులు

మఠంపల్లి : మండలంలోని వరదాపురంలో గ్రామ దేవతలైన శ్రీ పెద్దమ్మ, ముత్యాలమ్మ, అంకమ్మ, ఇంద్రపెల్లి ముత్యాలమ్మ, పోతురాజుల విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు మూడు రోజులుగా వైభవంగా కొనసాగుతన్నాయి. ఈ సందర్భంగా మంగళవారం గణపతి పూజ, పుణ్యాహవచనం, నవకలశస్నపణం, విగ్రహాల ఊరేగింపు, జలాధివాసం, జలాభిషేకం, శయ్యాదివాసం, క్షీరాభిషేకం, దాన్యాదివాసం చేపట్టారు. గ్రామ పొలిమేరలు కట్టడి చేసి బలిహరణ గావించారు. ఉత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం 8:12 నిమిషాలకు యంత్రబింబాలలో ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందని అనంతరం అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బచ్చలకూరి అఖిల బాబు, ఉపసర్పంచ్ శంకరయ్య, గ్రామపెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు మృతి



జగన్‌మోహన్‌రావు (ఫైల్)

కోదాడ : బీజేపీ కోదాడ పట్టణ అధ్యక్షుడు నకిరికంటి జగన్‌మోహన్‌రావు (45) అనారోగ్యంతో మంగళవారం కోదాడలోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. నడిగూడెం మండల కేంద్రానికి చెందిన ఆయన కోదాడలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకొని ఇక్కడే జీవిస్తున్నారు. ఏడాదిగా ఆయన బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయన మృతి పట్ల కోదాడ పట్టణ ఆర్యవైశ్య నాయకులు, బీజేపీ నాయకులు సంతాపం ప్రకటించారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

హుజూర్‌నగర్‌రూరల్ : ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం లభిస్తుందని సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వేపలసింగారంలో ఆశ కార్యకర్తలతో కలిసి ఆమె ఇంటింటి సర్వేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటి పరిసరాలలో వృథాగా ఉన్న పాత్రలలో నిల్వ నీటి వలన కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె వెంట కార్యదర్శి పెండెం నాగమణి, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

పింఛన్ కోసం తప్పని తిప్పలు

- పెన్షన్ పైసలు తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు
- ప్రతినెలా రామలక్ష్మీపురం పోస్టాఫీస్‌కు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన
- 'ఉపాధి' డబ్బులకు సైతం అక్కడికే..
- తమ గ్రామంలోనే ఇవ్వాలని వేడుకుంటున్నా పట్టించుకోని తపాలా శాఖ అధికారులు



బీక్యాతండా గ్రామపంచాయతీ కార్యాలయం

కోదాడరూరల్ : ప్రభుత్వం అందజేస్తున్న ఆసరా పింఛన్ తెచ్చుకునేందుకు మండలంలోని బీక్యాతండాకు చెందిన వృద్ధులు, వికలాంగులు, మహిళలు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో గ్రామానికి వెళ్లాల్సి వస్తోంది. ఉపాధి హమీ డబ్బులకు కూడా ఆ గ్రామానికి వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండకాలం, వానకాలం అయినా పింఛన్ డబ్బులు ఇవ్వడానికి పోస్ట్ మాస్టర్ మాత్రం ఆ గ్రామానికి రారు. దీంతో పింఛన్ డబ్బుల కోసం వెళ్లి ఇటీవల వడదెబ్బతో తండాకు చెందిన ఓ వృద్ధుడు మృతి చెందాడు.

తండాలో 199 మందికి ఆసరా పింఛన్లు..

బీక్యాతండాలో 199 మందికి ఆసరా పింఛన్‌లు వస్తున్నాయి. వీరిలో వృద్ధులు 87 మంది, వితంతువులు 73 మంది, వికలాంగులు 34 మంది, ఒంటరి మహిళలు ఉన్నారు. వీరందరూ ప్రతి నెల పింఛన్ డబ్బుల కోసం పక్కన రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న రామలక్ష్మీపురంలో ఉన్న పోస్టాఫీసు వద్దకు వెళ్లాలి. డబ్బుల కోసం ఒక రోజు పని వదిలిపెట్టుకొని వెళ్లాల్సి వస్తుందని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెళ్లిన తర్వాత డబ్బులు ఇచ్చే సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తితే మరో రోజు వెళ్లాల్సి వస్తుందని చెబుతున్నారు. ఇక డబ్బుల కోసం గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే డబ్బులు మా తండాలోనే ఇస్తే దూర భార సమస్య తప్పడంతో పాటు అనేక ఇబ్బందులు తప్పుతాయని తండావాసులు అంటున్నారు. ఇక పింఛన్ డబ్బులే కాకుండా గ్రామంలో 451 ఉపాధి హమీ జాబ్ కార్డులు ఉన్నాయని, 1200 మంది వరకు కూలీలు ఉన్నారని తెలిపారు. వీరందరు కూడా పని చేసిన డబ్బుల కోసం రామలక్ష్మీపురం గ్రామానికి వెళ్లి తీసుకోక తప్పడం లేదంటున్నారు. గ్రామ పంచాయతీ అయిన మా గిరిజతండాకు వచ్చి ఎందుకు డబ్బులు ఇవ్వరని తండా వాసులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. తండాకు వచ్చి డబ్బులు ఇస్తే వడదెబ్బకు గురై ఒకరు మృతి చెందేవారు కాదని అంటున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



పింఛన్ డబ్బులు తీసుకునేందుకు ప్రతినెల ఇబ్బందులు పడుతున్నాం. వికలాంగురాలిని కావడంతో రెండు కిలోమీటర్లు వెళ్లాలంటే తండాలో ఎవరో ఒకరి సహాయంతో వెళ్లి పింఛన్ తీసుకుంటున్నాను. మా దగ్గరే పింఛన్ ఇస్తే ఇబ్బందులు తప్పుతాయి.

– భుక్యా విజయ, వికలాంగురాలు

తండాలోనే పింఛన్ ఇవ్వాలి



పింఛన్ కోసం రెండు కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సి వస్తోంది. ఎండొచ్చిన, వానొచ్చిన పింఛన్ కోసం వేరే గ్రామానికి వెళ్లక తప్పడం లేదు. అధికారులు స్పందించి మా గ్రామంలోనే పింఛన్ డబ్బులు ఇవ్వాలి

– గుగులోతు లకుపతి

అనేకసార్లు దరఖాస్తులు పెట్టాం



ఉపాధి కూలీలకు, ఆసరా పింఛన్ లబ్ధిదారులకు మా తండాలోనే డబ్బులు ఇవ్వాలని అనేకసార్లు దరఖాస్తు పెట్టాం. పోస్ట్ మాస్టర్‌కి కూడా చెప్పాం. అయినా వారి నుంచి ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదు. ఇకనైనా తండాకి పోస్ట్‌మాస్టర్ వచ్చి డబ్బులు ఇవ్వాలి.

– బాణోతు అంబేద్కర్,సర్పంచ్, బీక్యాతండా

పేదల పక్షాన పోరాడిన వ్యక్తి వెంకటరెడ్డి



వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : పేదలు, రైతుల పక్షాన పోరాడిన వ్యక్తి పులిచింతల వెంకటరెడ్డి అని పలువురు నాయకులు అన్నారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సాగర్ ఆయకట్టు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సీపీఎం నాయకుడు పులిచింతల వెంకట్‌రెడ్డి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వెంకటరెడ్డి పట్టణానికి, సీపీఎంకి ఎనలేని సేవలందించారని కొనియాడారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పట్టణంలోని ఇందిరా సెంటర్‌లో వందల ట్రాక్టర్లతో ధర్నా చేసి నిరసన తెలిపిన ఉద్యమంలో ఆయన క్రియాశీలకంగా పాల్గొన్నారని తెలిపారు. సీపీఐ నాయకులు కంబాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గన్నా చంద్రశేఖర్, ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, ఆయకట్టు పరిరక్షణ కమిటీ కన్వీనర్ మేకల నాగేశ్వరరావు, వివిధ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు దొంగరి వెంకటేశ్వర్లు, అట్లూరి హరిబాబు, ఎం.వెంకటేశ్వర్లు, పి.వెంకట్ రెడ్డి, వై.రాములు, కె.అజయ్, జి.వెంకటేశ్వర్లు, డి.మల్లీశ్వరి, జడ శ్రీను, బ్రహ్మం, రమేష్, జి.వెంకట్ రెడ్డి, పి.వెంకటరెడ్డి, కె.సూర్యనారాయణ, పి.వెంకట్‌నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ఫలితాల్లో గోవిందపురం విద్యార్థుల ప్రతిభ

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని గోవిందపురంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గురుకుల ప్రవేశ పరీక్షలో ప్రభంజనం సృష్టించారు. ఐదవ తరగతి గురుకుల ప్రవేశ పరీక్షకు 19 మంది విద్యార్థులు హాజరు కాగా 15 మంది విద్యార్థులు సీట్లు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను మంగళవారం గోవిందపురానికి చెందిన కౌన్సిలర్లు, స్థానికులు అభినందించారు.

అంత్యాతండా విద్యార్థులకు గురుకుల సీట్లు

మఠంపల్లి : మండలంలోని అంత్యాతండా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న బానోతు అంజలి, బానోతు రాజేశ్వరి, బానోతు రిత్వికలు ఈనెల 29న ప్రభుత్వం ప్రకటించిన గురుకుల ప్రవేశ పరీక్షా ఫలితాలలో ప్రతిభ కనబరిచి సీట్లు సంధించారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల హెచ్ఎం ఎస్‌కె మస్తాన్ స్థానికంగా విద్యార్థులను అభినందించారు. ఆయన వెంట పాఠశాల ఉపాధ్యాయులు పి.సైదులు, టి.వెంకటేశ్వర్లు, తల్లిదండ్రులు, గ్రామపెద్దలు తదితరులు ఉన్నారు.

బాధితుడికి పరామర్శ

సూర్యాపేట రూరల్ : మండల పరిధిలోని కాసరబాద గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు చింత దేవయ్య భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో సూర్యాపేట జెడ్పీటీసీ జీడి భిక్షం, వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస్‌నాయుడు మంగళవారం కాసరబాదలో దేవయ్యను పరామర్శించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. వారి వెంట నాయకులు బంటు సైదులు, కొల్లు నరేష్, ఎల్లయ్య, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కొట్టె పద్మ

మేళ్లచెరువు : గ్రామాల్లో సమస్యలను పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ కొట్టె పద్మసైదేశ్వరరావు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో విద్యుత్, తాగునీరు, ఆరోగ్యం, రోడ్లు వంటి సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అధికారులు చొరవ చూపి పరిష్కరించాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ మాట్లాడుతూ జూన్ 1 నుంచి 22 వరకు నిర్వహించే రాష్ట్ర అవతరణ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోరారు. గత 10 సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్ర సాధించిన అభివృద్ధి, ప్రగతి గురించి ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ దామోదర్‌రావు, జెడ్పీటీసీ పద్మ, వ్యవసాయాధికారి పెద్ది శ్రీనివాస్‌గౌడ్, ఏపీఓ శైలజ, పశువైద్యాధికారిణి డాక్టర్ ఉషారాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



మఠంపల్లిలో సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న సయ్యద్‌రస్‌మియా



హుజూర్‌నగర్ : సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న శీలం శ్రీను

మఠంపల్లి : సమాజంలోని సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ సమరశీల పోరాటాలు చేస్తుందని సీఐటీయూ మండల కన్వీనర్, జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ రస్‌మియా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సీఐటీయూ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మంగళపల్లి మైసయ్య, కోల గురువారెడ్డి, ఎం.నరసింహారెడ్డి, ముత్యం, సైదులు, గురువయ్య, సైదా, నాగరాజు, వీరజానకి, లింగమ్మ, గోవిందమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో తెలంగాణ ప్రభుత్వం విఫలం

హుజూర్‌నగర్ : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో తెలంగాణ ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కరోనా కాలంలో డాక్టర్‌లను, మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికులను దేవుళ్లుగా కొనియాడిన ప్రభుత్వం ప్రస్తుతం వారిపై పనిభారం పెంచిందని ఆరోపించారు. వారికి కనీస వేతనం అమలు చేయడం లేదని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల సంఘం అధ్యక్షురాలు కస్తాల ముత్తమ్మ, కుమారి, దేవకరుణ, సైదులు, కాశయ్య, వీరబాబు, నాగేష్, చంద్రమ్మ, పార్వతి, సైదమ్మ, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.



గరిడేపల్లిలో సీఐటీయూ జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న యాకుబ్

కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్రం

గరిడేపల్లి : కార్మికుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తూ నాలుగు నల్ల చట్టాలను తీసుకొచ్చిందని సీఐటీయూ జిల్లా నాయకుడు యాకుబ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సీఐటీయూ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. బీజేపీ అనుసరిస్తున్న విధానాలతో అనేక మంది కార్మికులు రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదిలో రెండు కోట్ల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల సందర్భంగా చెప్పిన బీజేపీ నేడు ఆ మాటను నిలబెట్టుకోవడంలో విఫలమైందని ఆరోపించారు. నరేంద్రమోదీ కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ రంగ సంస్థలను ధారాదత్తం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కోటేశ్వర్‌రావు, సోమయ్య, గోపి, ఉప్పలయ్య, మురళి, సైదానాయక్, లగుపతి రవి, సూరిబాబు, గురువయ్య, సత్యం, సుధాకర్ తదితరులు ఉన్నారు.

లింగ వివక్ష, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

తిరుమలగిరి (తుంగతుర్తి) : మున్సిపాలిటీ పరిధిలోని మాలిపురంలో మార్పు సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం లింగ వివక్ష, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. సీహెచ్ఓ బిచ్చునాయక్ పాల్గొని మాట్లాడారు. బాలికల పట్ల వివక్ష చూపరాదని, స్త్రీ, పురుషులు సమానమేనని అన్నారు. పోరెళ్ల విప్లవకుమార్, స్వరూపాకుమారి, లలిత, పద్మ, చంద్రకళ, శారద, విమల, చైతన్య, రజిత పాల్గొన్నారు.

సమాజంలో చదువే గొప్ప సంపద



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో ఎంఈఓ, నిర్వాహకులు

కోదాడ : సమాజంలో చదువే గొప్ప సంపదని, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోదాడ మండల విద్యాధికారి సలీం షరీఫ్ కోరారు. 10వ తరగతి ఫలితాలలో నియోజకవర్గంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు మంగళవారం కోదాడకు చెందిన విజయీభవ ట్రస్ట్ ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ విద్యతో ఎన్నో విజయాలు సాధించవచ్చన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రోత్సహిస్తున్న విజయీభవ ట్రస్ట్ నిర్వాహకులను ఆయన అభినందించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో గల ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ టాపర్స్‌గా నిలిచిన 125 మంది విద్యార్థులకు కిట్స్ కళాశాల సహకారంతో మెమొంటోలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఇరుకుళ్ల చెన్నకేశవరావు, పైడిమర్రి రామారావు, బడుగుల సైదులు, బండారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'ట్రిపుల్ ఆర్'ను సద్వినియోగం చేసుకోవాలి



పాత బట్టలు సేకరిస్తున్న మున్సిపల్ సిబ్బంది

హుజూర్‌నగర్ : ట్రిపుల్ ఆర్ (రెడ్యూస్, రీసైకిల్, రీయూస్) సెంటర్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ కోతి సంపత్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 3వ వార్డులో ట్రిపుల్ ఆర్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వారి ఇళ్లలో ఉపయోగించని ప్లాస్టిక్ వస్తువులు, బట్టలు, ఆట బొమ్మలు మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని చెప్పారు. వాటిని తిరిగి అవసరమైన వారికి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. ప్రత్యేక పారిశుధ్య పనుల్లో భాగంగా వార్డులో రోడ్డుకి ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించారు. డ్రెయినేజీలలో పూడిక తీయించారు. కార్యక్రమంలో పర్యావరణ ఏఈ రాజశేఖర్, జవాన్ వెంకటేశ్వర్లు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయాలి



నేరేడుచర్ల : వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు



హుజూర్‌నగర్ : బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మహిళా సమాఖ్య నాయకులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : భద్రాద్రి కొత్తగూడెంలో సీపీఐ ఆధ్వర్యంలో జూన్ 4న నిర్వహించే ప్రజాగర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన అన్నారు. మంగళవారం చింతలపాలెంలో నిర్వహించిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశంలో బహిరంగ సభ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్తేల నారాయణరెడ్డి, మండల కార్యదర్శి చింతిరాల రవి, నాయకులు వీరబాబు, రామారావు, సైదులు, వెంకట్‌రెడ్డి, మధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలో కొత్తగూడెం వాల్ పోస్టర్ ఆవిష్కరణ

నేరేడుచర్ల : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జూన్ 4వ తేదీన జరిగే సీపీఐ ప్రజా బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దూళిపాల ధనుంజయనాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో చలో కొత్తగూడెం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకన్న, కత్తి మట్టారెడ్డి, పి.నరేందర్‌రెడ్డి, మల్లె పూల శ్రీను, కొత్తపల్లి శ్రీను తదితరులున్నారు.

ఆటోనగర్ నిర్మించొద్దని ధర్నా



ధర్నాలో పాల్గొన్న ఐలాపురం గ్రామస్తులు

చివ్వెంల(సూర్యాపేట) : మండల పరిధిలోని ఐలాపురం గ్రామ శివారులోని సర్వేనంబర్ 169 అసైన్డ్ భూమిలో ఆటో నగర్ నిర్మించొద్దని ఐలాపురం గ్రామస్తులు మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగు తరాలుగా తాము ఆ భూమిని నమ్ముకుని సేద్యం చేసుకుని జీవనం సాగిస్తున్నామని, ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఇప్పటికే ప్రభుత్వం కొంత భూమిని తీసుకుందని, మిగిలిన భూమిని తీసుకుంటే తమ జీవనం సాగేది ఎలా అని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆటోనగర్ నిర్మాణ ఆలోచనను విరమించుకుని తమకు శాశ్వత పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రంగరావుకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు బోడపట్ల శ్రీను, వినోద్‌కుమార్, జానకిరాములు, సైదులు, సాయిలు, వెంకన్న, అశోక్, నర్సయ్య, లింగయ్య, రత్తయ్య, భిక్షం, మదన్‌నాయక్, సుధాకర్, చంటి, సురేష్, తేజ, భిక్షపతి పాల్గొన్నారు.

నాసిరకంగా రోడ్డు పనులు!

- కంకరకు బదులుగా డస్ట్ వాడుతున్నట్లు ఆరోపణలు
- క్యూరింగ్ చేయకుండానే తారువేస్తున్న కాంట్రాక్టర్
- గణపవరం శివారులో గూనలు వేయలేదని రైతుల ఆవేదన
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



క్యూరింగ్ చేయకుండానే తారు వేస్తున్న కాంట్రాక్టర్

మునగాల : మండలంలోని కొక్కిరేణి – వెలిదెండ రోడ్డు నిర్మాణంలో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్డు నిర్మాణంలో కంకర వినియోగించకుండా డస్ట్ వాడుతున్నారని, క్యూరింగ్ చేపట్టకుండానే పైన తారు రోడ్డు వేస్తున్నారని చెబుతున్నారు. డస్ట్ వేసిన రోడ్డుపై క్యూరింగ్ చేయకపోవడంతో వాహనాల రాకపోకలతో దుమ్ము లేస్తుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి నిర్మాణంలో కనీస నిబంధనలు పాటించడం లేదని రోడ్డు నిర్మాణం ఒక పక్క వేసిన తర్వాత రెండవ పక్క మొదలు పెట్టాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా ఇష్టానుసారంగా పనులు చేపడుతుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మాణ సమయంలో ప్రమాద సూచికలు సైతం ఎక్కడా ఏర్పాటు చేయలేదు.

కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడంతో..

ముఖ్యంగా గణపవరం శివారులో పంట కాలువల సాగు నీరు వెళ్లేందుకు గతంలో ఉన్న పలు కల్వర్టుల స్థానంలో ప్రత్యేకంగా గూనలు వేయాల్సి ఉండగా కాంట్రాక్టర్ గూనలు వేయకుండా కల్వర్టులను పూర్తిగా మూసివేసి తారురోడ్డు వేస్తుండడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీంతో గణపవరం గ్రామానికి చెందిన పలువురు రైతులు స్వయంగా గూనలు కొనుగోలు చేసి జేసీబీ సాయంతో తారురోడ్డును పెకిలించి గూనలు వేసుకుంటున్నారు. కల్వర్టులు ఏర్పాటు చేయాలని సదరు కాంట్రాక్టర్‌ను తాము కోరినప్పటికీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని రైతులు తెలిపారు.

రూ. 20 కోట్ల నిధులతో..

మండల కేంద్రంలోని జాతీయ రహదారి నుంచి గరిడేపల్లి మండలం కీతవారిగూడెం వరకు గల 18 కి.మీ మేర ఆర్అండ్‌బీ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చేందుకు ప్రభుత్వం సీఆర్ఐఎఫ్ నిధుల నుంచి రూ.20 కోట్ల నిధులు మంజూరు చేయగా మూడు నెలల కిందట పనులు ప్రారంభమయ్యాయి. 18 కి.మీ పొడవు ఉన్న ఈ రహదారికి గత కొన్ని సంవత్సరాలుగా ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో మోకాళ్ల లోతు గుంతలు ఏర్పడి ప్రయాణానికి ఆయా గ్రామాల ప్రజలు నరకయాతన అనుభవించారు. ఈ రహదారిని డబుల్ రోడ్డుగా మార్చాలని గత పదేళ్లుగా ప్రజలు పలుమార్లు అధికార్లు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లగా ఎట్టకేలకు డబుల్ రోడ్డుకు నిధులు మంజూరు కావడంతో పనుల ప్రారంభమయ్యాయి. 66 అడుగుల వెడల్పు గల ఈ రహదారి గరిడేపల్లి మండల పరిధిలో 8కి.మీ, మునగాల మండల పరిధిలో 10కి.మీ కలిగి ఉన్నది. ఈ రోడ్డు మీదుగా మునగాల, గరిడేపల్లి, పెన్‌పహాడ్, చిలుకూరు మండలాలకు చెందిన 15 గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు.



కల్వర్టు ఏర్పాటు చేసేందుకు రైతులు తీసుకెళ్తున్న గూనలు

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



కొక్కిరేణి– వెలిదెండ డబుల్ రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. నాణ్యత లోపంతో నిర్మిస్తే అనతికాలంలోనే మరమ్మతులకు గురయ్యే అవకాశం ఉంది. కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తిచేయాలి.

– మేదరమెట్ల వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకుడు, కొక్కిరేణి

దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నాం



కొక్కిరేణి– వెలిదెండ రోడ్డు నిర్మాణపు పనులలలో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. రోడ్డు నిర్మాణానికి డస్ట్‌ను వినియోగిస్తున్నారు. కనీసం నీటితో క్యూరింగ్ కూడా చేయడం లేదు. రోడ్డు మీద ప్రయాణించాలంటే దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రతిరోజు నీటితో క్యూరింగ్ చేయాలి.

– నారగాని వెంకన్న, ఆటో డ్రైవర్, మునగాల

నిత్యం పర్యవేక్షిస్తున్నాం

కొక్కిరేణి, తిమ్మారెడ్డిగూడెం, గణపవరం గ్రామాల సరిహద్దులలో డబుల్ రోడ్డు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కల్వర్టుల విషయంలో కాంట్రాక్టర్‌కు ఇప్పటికే తగు సూచనలు, సలహాలు ఇచ్చాం. పనులను నిత్యం పర్యవేక్షిస్తున్నాం.

– బి.సత్యనారాయణ, ఆర్అండ్‌బీ ఏఈ